సాక్షి
అనంతపురం
మంగళవారం : 28 : మే : 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



నిరుద్యోగుల కల్పతరువు

ఎస్కేయూ సమీపంలో ఏర్పాటైన రూడ్‌సెట్ సంస్థ జిల్లాలో నిరుద్యోగులకు కల్పతరువుగా మారింది.

8లో

గరిష్టం/కనిష్టం
34.4°/24.1°

జిల్లా అంతటా సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వడగాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'నైరుతి'కి అనుకూల వాతావరణం



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రవేశానికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి సోమవారం తెలిపారు. అరేబియా సముద్రం, కొమెరిన్, మాల్దీవులు, లక్షద్వీప్ ప్రాంతాల నుంచి కేరళ ప్రాంతానికి నైరుతి రుతుపవనాలు సాగడానికి అనుకూలంగా ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. ప్రస్తుతం ఏపీ, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నట్లు తెలిపారు. రాగల మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని, పొడి వాతావరణం ఉంటుందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపారు.

కొత్త కోర్సులకు ఆమోదం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కంప్యూటర్ సైన్సెస్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్, డేటా సైన్సెస్ రెండు కోర్సులు అమలు చేస్తున్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 120 సీట్లు మంజూరు చేస్తూ ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతి ఇచ్చింది. ఉత్తర్వులను సోమవారం వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అందజేశారు.

సూచనలు పాటిస్తే మేలు

- రైతులకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచన



బుక్కరాయసముద్రం: పంటల సాగు సమయంలో వాతావరణ ఆధారిత సూచనలు పాటిస్తే మేలు కలుగుతుందని రైతులకు రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల్లో దుక్కులు చేసుకోవాలన్నారు. దీంతో తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. గాలి, సూర్యరశ్మి బాగా చేరి సారవంతమవుతుందన్నారు. కలుపు, తెగుళ్ల ఉధ్రుతి తగ్గుతుందన్నారు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేరుశనగలో అధిక దిగుబడినిచ్చే రకాలైన కదిరి లేపాక్షి, కదిరి హరితాంధ్ర, టీసీజీఎస్–1694, కే6, ధరణి మొదలైన విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్ ఫాంను విద్యార్థికి అందజేస్తున్న కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి

అనంతపురం:పాలిసెట్–2024 వెబ్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో బాలికలు 52, బాలురు 74 మంది, మొత్తం 126 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు కోఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు.

'పది' పరీక్షకు 1,641 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 1,641 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 2,132 మంది విద్యార్థులకు గాను 491 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాల్లో పరీక్ష జరిగింది.

నమో వేంకటేశాయ



అశేష భక్తజనం నడుమ సాగుతున్న ప్రసన్న వేంకటరమణస్వామి రథోత్సవం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది.భక్తజనంతో వినాయక సర్కిల్ నుంచి నేసేపేట బొడ్డురాయి వరకూ ప్రాంతం కిక్కిరిసింది. ఉదయం 11.30 గంటలకు స్థానిక తేరుబజారు వద్ద అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య రథాంగ పూజలు చేశారు. వేలాది మంది భక్తులు మడుగు రథాన్ని వినాయక సర్కిల్ వరకు లాగారు. సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి నిర్వహించిన బ్రహ్మ రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. నమో వేంకటేశాయ నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. వైఎస్సార్ సీపీ నేత మెట్టు విశ్వనాథరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు హాజరై స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

శాంతిభద్రతల సమస్య తలెత్తనీయొద్దు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ, కమిషనర్

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా పలు రాష్ట్రాల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని చెప్పారు. కౌంటింగ్ కోసం నియమించిన సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను రిటర్నింగ్ అధికారులు రోజూ సందర్శించాలని చెప్పారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: కౌంటింగ్ రోజున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. జిల్లాలోని ఎస్సై, ఆపై స్థాయి అధికారులతో సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భద్రతా చర్యలను సమీక్షించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి చర్యలు చేపట్టాలో దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, చెడునడత కలిగిన వారిని, సమస్యలు సృష్టించేవారిని బైండోవర్లు చేయాలన్నారు. ఇది వరకే కేసులు ఉండి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘర్షణలకు దిగిన వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు పటిష్టంగా నిర్వహించి ఆయా గ్రామాల్లోని తాజాగా పరిస్థితులపై సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లు, కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు, వాహనాల తనిఖీలు, గ్రామసభల నిర్వహణ విస్తృతం చేయాలన్నారు. డ్రోన్లు వినియోగించి ఫలితాలు వెల్లడయ్యాక విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. 144 సెక్షన్ తప్పకుండా అమలు చేయాలని కోరారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది ఒకే చోట ఉంటే అదుపులోకి తీసుకుని చట్టపరంగా ముందుకెళ్లాలని సూచించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల నివాసాలు, పరిసరాలలో భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు.

కరుణించు కృష్ణమ్మ.. దీవించు భద్రమ్మ

తొలకరి వర్షాలతో వరుణుడు మురిపిస్తున్నాడు. దీంతో సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. అయితే, ఇదే సమయంలో తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో ప్రారంభం కాకపోవడం కాస్త ఆందోళన కలిగిస్తోంది. గతేడాదిలా కాకుండా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు నిండాలని, ఆయకట్టు కింద పంటలు కళకళలాడాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

- తొలకర్లతో మురిపించిన వరుణుడు
- సాగుకు ఉత్సాహంగా సన్నద్ధమవుతున్న రైతన్నలు
- కృష్ణా, తుంగభద్ర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో లేక కాస్త ఆందోళన
- వర్షాలు బాగా కురిసి పంట పండాలని ఆకాంక్ష



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం జిల్లాను ఆదుకుంటోంది. హెచ్చెల్సీ ద్వారా ఆదరువుగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నాలుగేళ్లు సమృద్ధిగా తుంగభద్ర జలాలు వచ్చాయి. 2021–22లో కోటాకు మించి నీరు జిల్లా చేరాయి. తుంగభద్ర జలాశయంలో 140 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పుడు హెచ్చెల్సీకి 32 టీఎంసీల నికర జలాల కోటా ఉంటుంది. 2021–22లో పుష్కలంగా నీరు ఉండడంతో ఏకంగా 33.778 టీఎంసీలు జిల్లాకు తీసుకురాగలిగారు. గతేడాది మాత్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో ప్రాజెక్టు నిండలేదు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం చొరవ చూపి వీలైనంత ఎక్కువ నీటిని తీసుకొచ్చింది.16.071 టీఎంసీలు రాబట్టి, జిల్లాలో పంటలను కాపాడింది. చెరువులు నిండడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగాయి.

ప్రాజెక్టులపై టీడీపీ నిర్లక్ష్యం..

జిల్లాకు వరప్రదాయినులుగా ఉన్న ప్రాజెక్టులపై గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రికగా పేరొంది, జిల్లా అవసరాలను తీర్చే హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుపైనైతే అంతులేని అలసత్వం వహించింది. హంద్రీనీవా ద్వారా జిల్లాకు నీటిని తీసుకురావడంలో చేతులెత్తేసింది. 2013–14, 2015–16 సంవత్సరాల్లో కేవలం 5 టీఎంసీలు మాత్రమే జిల్లాకు వచ్చాయి. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లాకు కేటాయించిన నీటిని తీసుకురావడంలో ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల్లో సైతం 17.143 టీఎంసీలు తీసుకువచ్చారు. హంద్రీనీవా కింద ఉన్న చెరువులను నింపారు. ప్రధాన కాలువపై పరోక్షంగా ఆధారపడిన పంటలకు సాగునీటిని అందించారు. 2020–21లో అత్యధికంగా 34.756 టీఎంసీలు తీసుకువచ్చి రికార్డు సృష్టించారు.

పెరుగుతున్న ఆయకట్టు

గతంలో కేవలం హెచ్చెల్సీ కింద మాత్రమే పంటలు సాగు చేసేవారు. మన జిల్లాతో పాటు కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండేది. నికరంగా లక్ష ఎకరాలకు సాగు నీరు అందేవి. అయితే గత కొన్నేళ్లుగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయి. భూగర్భజలాల పెంపు కోసం చెరువులను నింపడంతో పాటు పంటలకు కూడా సాగునీరు అందిస్తున్నారు. దీంతో ఏడాదికేడాది ఆయకట్టు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది హెచ్చెల్సీ,హంద్రీనీవాల కింద దాదాపు 1.50 లక్షల ఎకరాలకు పైగా సాగు నీరందించాలని అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. ఆ మేర పంటలు సాగులోకి వచ్చే అవకాశముంది.

టీడీపీ హయాంలో హంద్రీనీవా ద్వారా జిల్లాకు వచ్చిన నీరు (టీఎంసీల్లో)

సంవత్సరం	కృష్ణాజలాలు
2013-2014	5.352
2014-15	12.581
2015-16	5.96
2016-17	26.307
2017-18	26.037
2018-19	26.943

వైఎస్సార్‌సీపీ హయాంలో..

సంవత్సరం	కృష్ణాజలాలు
2019-20	30.632
2020-21	34.756
2021-22	21.149
2022-23	19.339
2023-24	17.143

టీడీపీ హయాంలో హెచ్చెల్సీకి వచ్చిన నీరు (టీఎంసీల్లో)

2014-15	22.520
2015-16	16.997
2016-17	10.327
2017-18	17.399
2018-19	21.572

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

2019-20	27.151
2020-21	26.346
2021-22	33.778
2022-23	30.091
2023-24	16.071

జూన్ మొదటి వారం నుంచి నీటి చేరిక!

బొమ్మనహాళ్: జూన్ మొదటి వారం నుంచి తుంగభద్ర జలాశయానికి నీటి చేరిక మొదలయ్యే అవకాశాలున్నట్లు టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. డ్యాం ఎగువ ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఈ మేరకు అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నాటికి డ్యాంలో 1577.43 అడుగుల వద్ద 3.350 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,579.67 అడుగుల వద్ద 4.300 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, 1,020 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 242 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

ఆశాజనకంగా వర్షాలు!



ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురిసే అవకాశాలున్నాయి. ఇటీవల పడిన వర్షాలకు ప్రాజెక్టుల్లోకి పెద్దగా ఇన్‌ఫ్లో రాలేదు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాలు జూన్ నుంచి ప్రారంభమవుతాయి. ఆగస్టు వరకూ కొనసాగుతాయి. గతేడాది వర్షాభావ పరిస్థితుల్లోనూ సమష్టిగా పనిచేసి అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేశాం. ఈ ఏడాది వర్షాలను అంచనా వేసుకొని ప్రణాళిక తయారు చేసుకుంటాం. జిల్లా రైతులకు పుష్కలంగా నీటిని అందించి ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తాం.

– దేశానాయక్, ఎస్ఈ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం

ఓట్ల లెక్కింపు పక్కాగా జరగాలి

- అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి
- ఫిర్యాదులున్న ఉద్యోగులకు కౌంటింగ్ విధులు వద్దు
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



అనంతపురం అర్బన్: 'ఓట్ల లెక్కింపు కార్యక్రమం పక్కాగా జరగాలి. ప్రక్రియపై ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. ఏ దశలోనూ వివాదాలకు తావివ్వకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సహకారం కావాలన్నా నేరుగా వచ్చి తనను కలవొచ్చన్నారు. ఫిర్యాదులొచ్చిన ఉద్యోగులకు కౌంటింగ్ విధులు అప్పగించరాదన్నారు. జిల్లాలో పోలింగ్ సజావుగా నిర్వహించారంటూ అధికారులను అభినందించారు. అదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా చూద్దామని పిలుపునిచ్చారు. కౌంటింగ్ కేంద్రం రిటర్నింగ్ అధికారుల నియంత్రణలో ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహిస్తామనే ఆత్మవిశ్వాసం అందరిలోనూ కనిపించాలన్నారు. ప్రతి ఆర్‌ఓ వద్ద ఒక డిప్యూటీ తహసీల్దారు, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. కౌంటింగ్ కోసం నియమించిన సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్‌ను జూన్ 2న నిర్వహించి అదే రోజున శిక్షణ ఇవ్వాలని చెప్పారు. పోలింగ్, ఆ తరువాతి రోజు నుంచి అందిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. కౌంటింగ్ ఏజెంట్లకు జూన్ 2న గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం మీడియా సెంటర్, బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో హై స్పీడ్ ఇంటర్నెట్, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఉండాలని, బీఎస్ఎన్ఎల్, ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్లు సిద్ధంగా ఉండాలని చెప్పారు. జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ఏర్పాట్లు పూర్తవ్వాలి

కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపునకు చేపట్టిన ఏర్పాట్లు 48 గంటల్లో పూర్తవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో పూర్తిగా బ్యారికేడింగ్ చేపట్టాలని, కిటికీలు కూడా పూర్తిగా కవర్ చేస్తూ గ్రిల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు. జేసీ కేతన్‌గార్గ్ ఆయన వెంట ఉన్నారు.

సీఎస్, సీఏ, ఎంఓలకు శిక్షణ

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సీఎస్, సీఏ, ఎంఓలది కీలక పాత్ర అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. కౌంటింగ్ అంశంపై సోమవారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు (సీఎస్), కౌంటింగ్ అసిస్టెంట్లు (సీఏ), మైక్రో అబ్జర్వర్లకు (ఎంఓ) నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులను కౌంటింగ్‌కు ఎంపిక చేశామన్నారు. దాదాపు అందరికీ పలు ఎన్నికల్లో పని చేసిన అనుభవం ఉంటుందన్నారు. కౌంటింగ్ క్రమంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రక్రియ సజావుగా నిర్వహించాలని చెప్పారు. తాను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని ఏదైనా సమస్య వస్తే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సంయమనం పాటిస్తూ అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈసీ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియపై ఎవరూ బయట మాట్లాడకూడదన్నారు. నిబంధన ఉల్లంఘించి మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఈవీఎంలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్ తెరవడం గురించి ఇంజినీర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్నోబిలేశుడి బ్రహ్మరథోత్సవం

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్రహ్మరథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఉదయం 10 గంటలకు మడుగుతేరు అనంతరం సాయంత్రం 5 గంటలకు ధూళోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, ఉచిత భోజనం, మరుగుదొడ్ల వసతి, ఆలయం చుట్టూ చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి సన్నిధిలో దాసాంగాలు పెట్టుకొనే భక్తులకు ప్రత్యేకంగా కాటేజులు, వసతి సముదాయాలు కేటాయించారు. పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం సందర్భంగా ఆర్టీసీ కూడా కావాల్సినన్ని బస్సులు నడపనుంది. భక్తుల కోసం మంగళవారం ఉరవకొండ నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక సర్వీసును అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక.. రథోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



సూర్యప్రభ వాహనం పై శ్రీవారు

వైభవంగా సూర్యప్రభ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు భూదేవి, శ్రీదేవి సమేతంగా సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సనాతన హైందవ సంప్రదాయంలో సూర్యారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. సూర్యప్రభ వాహనంపై ఉన్న స్వామిని దర్శించుకుంటే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

క్లుప్తంగా

ఇద్దరు పోలీసు అధికారులపై చర్యలు

అనంతపురం: ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లకు సంబంధించి ముందస్తు అప్రమత్తం చేయడంలో విఫలమైన ఇద్దరు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. భద్రత, నిఘా వైఫల్యానికి బాధ్యులుగా పేర్కొంటూ జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ జాకీర్‌హుస్సేన్‌ను మంగళగిరిలోని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

సబ్ పోస్ట్‌మాస్టర్ల బదిలీ

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖ డివిజన్‌లో 18 మంది సబ్ పోస్ట్‌మాస్టర్లను బదిలీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ గుంపస్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు జూన్ 30వ తేదీలోపు కొత్త స్థానాల్లో చేరాలని ఆదేశించారు. బదిలీ అయిన వారిలో అనంతపురంలోని వివిధ పోస్టాఫీసుల్లో పనిచేస్తున్న బీఎం జిలానీ, ఎల్. సరా ప్రీతిక, ఎస్.దాక్షాయణి, వీఆర్ గిరిబాబు, బీఓ రాఘవేంద్రగౌడ్, పి.వనజాక్షమ్మ, జి.రమేష్‌గౌడ్, సి.మధురిమరాణి, ఎల్.పవన్‌కుమార్‌రెడ్డి, సి.రవికుమార్, ఎస్.సాయికుమార్, శింగనమలలో పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లు, ఎల్.బద్రీనారాయణ (గుత్తి), ఎస్.నూరుల్ హుదా (గుంతకల్లు), కె.శ్రీనివాసాచారి (కొనకొండ్ల), పి.అమీర్‌బాషా (కల్లూరు ఆర్ఎస్), ఎస్.చాంద్‌బాషా (తాడిపత్రి), పి.విశ్వనాథ్ (రాయలచెరువు) ఉన్నారు.

నిరుద్యోగులకు కల్పతరువు రూడ్‌సెట్



'మానవ సేవే మాధవసేవ అనే సేవా భావం అలవర్చుకుని... సామాన్య ప్రజలకు సేవ చేస్తుండడం గొప్ప అనుభూతి కలిగిస్తోంది. సంస్థలో శిక్షణ పొందుతున్న అభ్యర్థుల క్రమశిక్షణ, సోదరభావం నన్ను ఆకట్టుకున్నాయి. భవిష్యత్తు సృష్టికర్తలు మీరే అని ప్రగాఢంగా నమ్ముతున్నా. అనంతపురం జిల్లాలో ఇలాంటి సంస్థలు ఉండడం గొప్ప విషయంగా భావిస్తున్నా.'

.... ఈ మాటలు అన్నది ఎవరో కాదు... ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ఉన్న డాక్టర్ వి.వినోద్‌కుమార్ తన ఐఏఎస్ శిక్షణలో భాగంగా 2017లో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో రూడ్‌సెట్‌ను పరిశీలించిన ఆయన తన భావనను అప్పట్లో అక్కడి విజిటర్స్ పుస్తకంలో ఇలా పంచుకున్నారు.

ధర్మస్థలం ట్రస్టు, కెనరా బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (రూడ్‌సెట్) నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా మారింది. 28 రకాల కోర్సుల్లో ఉచితంగా వసతితో కూడిన శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించి, వారి పురోగతికి దోహదపడుతోంది. రూడ్‌సెట్‌లో శిక్షణ పొందిన ఎందరో నేడు ఉన్నత శ్రేణిలో జీవనం సాగిస్తున్నారు.

- 28 రకాల కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు
- ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు వరం

అనంతపురం: గ్రామీణ నిరుద్యోగుల్లో సాధికారత నింపే లక్ష్యంతో ఏర్పాటైన రూడ్‌సెట్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్య సాధనలో విజయవంతంగా ముందుకు సాగుతోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇవ్వడమే కాక వారి జీవనోపాధులను మెరుగు పరిచి ఉన్నత శ్రేణి జీవితాన్ని అందించడంలో రూడ్‌సెట్ కీలక పాత్ర పోషిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 840 మంది శిక్షణ పొందగా... వీరిలో 308 మందికి బ్యాంకుల సహకారంతో రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు. మరో 295 మంది స్వతహాగా స్వయం ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. 10 మంది ఇతర సంస్థల్లో ఉపాధి పొందుతున్నారు.

శిక్షణ పూర్తికాగానే బ్యాంక్ రుణం

అనంతపురంలోని ఎస్కేయూ సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ మహిళలు, పురుషులకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. ఆధార్ కార్డు కలిగి ఉండి... 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. మొత్తం 28 రకాల కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆసక్తి ఉన్న వారికి బ్యాంక్ లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించి వ్యాపారాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో ఎలాంటి లాభాపేక్షను సంస్థ ఆశించకపోవడం గమనార్హం. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయడం లేదు. కాగా, ఉచితంగా హాస్టల్ సదుపాయం, భోజన వసతి కల్పిస్తారు. సంవత్సరంలోనే ప్రతి నెలా ఒక్కో రంగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. నెల రోజుల్లోపు శిక్షణ పూర్తి చేసిన అనంతరం స్వయం ఉపాధి కల్పనపై అవగాహన కల్పిస్తారు.



రూడ్‌సెట్ భవనం

అందిస్తున్న కోర్సులు

కోర్సు	అర్హులు	కాల వ్యవధి
ఉమెన్స్ టైలరింగ్	మహిళలు	30 రోజులు
బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్	మహిళలు	30 రోజులు
ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్, సర్వీసెస్	పురుషులు	30 రోజులు
డెయిరీ ఫార్మింగ్, వర్మీ కంపోస్ట్	పురుషులు	10 రోజులు
ఫొటోగ్రఫీ/వీడియోగ్రఫీ	పురుషులు	30 రోజులు
గొర్రెల పెంపకం	పురుషులు	10 రోజులు
ఇన్‌స్టలేషన్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ సీసీ టీవీ	పురుషులు	13 రోజులు
ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్	మహిళలు	30 రోజులు
కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్	---	45 రోజులు

- డ్రెస్ డిజైనింగ్ ఫర్ ఉమెన్, పికిల్ అండ్ పాపెడ్ మేకింగ్, సిల్క్ థ్రెడ్ అండ్ జ్యువెలరీ మేకింగ్‌పై మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.
- సోలార్ అండ్ ఎల్ఈడీ ఎక్విప్‌మెంట్ అసెంబ్లింగ్, మల్టీ ఫోన్ సర్వీసింగ్, స్మార్ట్‌ఫోన్ సర్వీసింగ్, ఎల్ఎంవీ డ్రైవింగ్, ఎలక్ట్రికల్ మోటార్ రీవైండింగ్ అండ్ పంప్‌సెట్ మెయింటెనెన్స్ కోర్సులపై పురుషులకు శిక్షణ ఇస్తారు.

త్వరలో మరిన్ని కొత్త కోర్సులు



సంస్థ వ్యవస్థాపకులు వీరేంద్ర హెగ్డే కల సాకారం చేస్తూ రూడ్‌సెట్‌లో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ జీవితంలో స్థిరపడేలా శిక్షణ ఇస్తున్నాం. వారు మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చేస్తున్నాం. త్వరలో మరిన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన ఉంది.

– ఎస్. విజయలక్ష్మి , రూడ్‌సెట్ డైరెక్టర్, అనంతపురం

ప్రముఖ సంస్థల జాబితాలో చోటు దక్కడం ఖాయం



అనంతపురంలోని రూడ్‌సెట్ సంస్థకు రాష్ట్రంలోని ప్రముఖ సంస్థల జాబితాలో చోటు దక్కడం ఖాయమనిపిస్తోంది. టీంవర్క్‌తో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో స్వల్పకాలంలోనే సంస్థ ప్రతిష్ట పెరిగింది. జిల్లా అధికారుల సహకారంతో కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణం.

– డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ (రూడ్‌సెట్ విజిటర్స్ బుక్ సౌజన్యంతో)

విత్తన రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కూడేరు: రైతులకు అందుబాటులో ఉంటూ విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్‌బీకే సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. సోమవారం ఆమె కూడేరులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. సబ్సిడీ విత్తన వేరుశనగ ప్రక్రియను పరిశీలించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకీ సబ్సిడీ విత్తన వేరుశనగ అందాలన్నారు. ఏఓ విజయకుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ 1,389 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 900 మందికి 1,104 క్వింటాళ్ల వేరుశనగను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీ రవి, ఏఓ విజయ కుమార్, ఏఈఓ శైలజ, వీహెచ్ఏ సాజియా, ఎంపీఈఓ యాస్మిన్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శ్రీనివాసచారి (ఫైల్)

కణేకల్లు: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం ఆదిగానిపల్లికి చెందిన కమ్మరి శ్రీనివాసచారి (45) వ్యవసాయ పనిముట్లు (వెల్డర్) చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దిన చర్యలో భాగంగా సోమవారం మధ్యాహ్నం మడకల పరికరాలకు వెల్డింగ్ చేస్తున్న సమయంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీనివాసాచారిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు


- ప్రగతిలో వెనుకబడిన ఏఎన్ఎంలకు మెమోలివ్వండి
- అధికారులను ఆదేశించిన డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: వైద్య సేవలందించడంలో ప్రగతి సాధించని ఏఎన్ఎంలపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హెచ్చరించారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమావేశమై మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎంలపై అసహనం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య సేవల్లో 98 శాతం ప్రగతి కనిపించాలన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ప్రగతి సాధించని ఏఎన్ఎంలకు మెమోలివ్వాలని సంబంధిత మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలందించాలన్నారు. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా ఏఎన్ఎంలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, సిబ్బంది లక్ష్మణ్ణ, హేమలత, జమీల, రాజు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ఓబులేసు (ఫైల్)

అనంతపురం: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన వరికూటి ముత్యాలు కుమారుడు ఓబులేసు (49) ఇతరుల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలు, వ్యవసాయానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో అప్పు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షల వరకూ చేరుకుంది. ఈ క్రమంలో డబ్బు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ఓబులేసు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనంతపురం నాల్గో పట్టణ సీఐ ఆర్.ప్రతాపరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తండ్రితో తాగుడు మాన్పించలేక....



విష్ణువర్ధన్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: మద్యానికి బానిసైన తండ్రిని మార్చుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లికి చెందిన వడ్డే రాజేష్, రేవతి దంపతులకు ఓ కుమార్తెతో పాటు కుమారుడు విష్ణువర్ధన్(19) ఉన్నారు. బేల్దారి పనులతో పాటు వ్యవసాయ కూలి పనులు చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రస్తుతం విష్ణువర్ధన్ అనంతపురంలోని ఓ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. చాలా కాలంగా రాజేష్‌కు మద్యం సేవించడం అలవాటుగా ఉండేది. ఇటీవల అది శ్రుతిమించి మోతాదుకు మించి మద్యం తాగి మత్తులో ఎక్కడపడితే అక్కడే పడిపోయేవాడు. గమనించిన చుట్టుపక్కల వారు రాజేష్ ఆచూకీ తెలపడంతో కుటుంబసభ్యులు వెళ్లి ఇంటికి పిలుచుకువచ్చేవారు. ఈ నేపథ్యంలోనే తెలిసిన వారు పలుమార్లు రాజేష్‌తో మద్యం అలవాటు మాన్పించాలని కుటుంబసభ్యులకు చెబుతూ వచ్చారు. అయితే తమ మాట తండ్రి వినకపోవడం... తరచూ చుట్టుపక్కల వారు హితబోధనలు చేయడం వంటి చర్యలతో సమాజంలో తలెత్తుకుని తిరగలేని స్థితికి చేరుకున్నామని కుటుంబసభ్యులు లోలోన మదనపడేవారు.

ఆదివారం సాయంత్రం అమగొండపాళ్యం రోడ్డు పక్కన మద్యం మత్తులో రాజేష్ పడి ఉన్నాడని తెలుసుకున్న విష్ణువర్ధన్ అక్కడకు చేరుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి చేర్చాడు. ఆ సమయంలో తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేనప్పుడు తాగుడు ఎందుకు అంటూ కుమారుడు నిలదీశాడు. కుమారుడి వాదనలతో తండ్రి ఏకీభవించకుండా తనదైన శైలిలోనే సమాధానమిస్తూ వచ్చాడు. దీంతో ఇక తండ్రిలో మార్పు రాదని గ్రహించిన విష్ణువర్ధన్... ఆదివారం రాత్రి ఇటీవల నిర్మించిన ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా పాత ఇంటికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం విష్ణు అవ్వ పాలు పితకడానికి పాత ఇంటి వద్ద ఉన్న పశువుల పాక వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఉరికి విగత జీవిగా వేలాడుతున్న మనవడిని చూసి గట్టిగా కేకలు వేసి అప్రమత్తం చేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కుటుంబాన్ని నిలబెడతాడనుకున్న కుమారుడు చనిపోవడంతో కుటుంబసభ్యుల రోదనలకు అంతులేకుండా పోయింది.

ఐదో తరగతి మిగులు సీట్లకు రేపు కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఏజీ సెట్–2024 ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మార్కుల ఆధారంగా బాలుర పాఠశాలల్లో ఉన్న 26 ఖాళీలు, బాలికల పాఠశాలల్లో ఉన్న 12 ఖాళీలను 1:3 నిష్పత్తిలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడిచారు.

- బాలురకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 22 నుంచి 20 మార్కుల వరకు (ర్యాంక్ 7133 నుంచి 7936 వరకు), ఎస్టీ కేటగిరీలో 30 మార్కులకు (ర్యాంక్ 3375 నుంచి 3435 వరకు), బీసీ కేటగిరిలో 47 మార్కులకు (ర్యాంక్ 54 నుంచి 71 వరకు), ఓసీ కేటగిరీలో 46 మార్కులకు (ర్యాంక్ 111 నుంచి 117 వరకు) కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.
- బాలికలకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 21 మార్కులకు (ర్యాంక్ 9711 నుంచి 9778 వరకు), బీసీ కేటగిరిలో 44 నుంచి 43 మార్కుల వరకు (ర్యాంక్ 201 నుంచి 308 వరకు), ఓసీ కేటగిరీలో 45 నుంచి 44 మార్కుల వరకు (ర్యాంక్ 171 నుంచి 211 వరకు) కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.
- మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు ఎంపికైన వారి సమాచారంను దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్లకు అందించామన్నారు. ఎంపికైన విద్యార్థులు మెరిట్ కార్డ్, నాల్గో తరగతి స్టడీ, ఆధార్‌కార్డ్, కులం, ఆదాయ ధృవీకరణపత్రాలతో 29న ఉదయం 9 గంటలకు కురుగంట గురుకుల పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.

ఇంటర్ మిగులు సీట్లకు 31న

ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు మిగులు సీట్ల భర్తీకి ఈనెల 31న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఏజీ సెట్–2024 ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బాలుర పాఠశాలల్లో 14, బాలికల పాఠశాలల్లో 19 ఖాళీలు ఉన్నాయన్నారు.

- బాలురకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 16.25 మార్కులకు (7569 ర్యాంక్ నుంచి 7676 వరకు), ఎస్టీ కేటగిరీలో 22.5 నుంచి 16.5 మార్కుల వరకు (4951 నుంచి 7352 ర్యాంక్ వరకు), బీసీ కేటగిరీలో 55 నుంచి 53 మార్కుల వరకు (392 నుంచి 475 ర్యాంక్ వరకు) బాలురు హాజరు కావాలని సూచించారు.
- బాలికలకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 10 మార్కులకు (18,523 ర్యాంక్ నుంచి 18,782 వరకు), ఎస్టీ కేటగిరీలో 17.75 నుంచి 17.5 మార్కుల వరకు (11,821 నుంచి 11,981 ర్యాంక్ వరకు), బీసీ కేటగిరీలో 43.75 నుంచి 39.25 మార్కుల వరకు (1334 నుంచి 1998 ర్యాంక్ వరకు), ఓసీ కేటగిరీలో 40 నుంచి 38.75 మార్కుల వరకు (1894 నుంచి 2072 ర్యాంక్ వరకు) బాలికలు హాజరుకావాలని సూచించారు.
- మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల సమాచారంను దరఖాస్తు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్లకు పంపామని పేర్కొన్నారు. మెరిట్‌కార్డ్, పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ, ఆధార్‌కార్డ్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని 31న ఉదయం 9 గంటలకు కురుగుంట గురుకుల పాఠశాలకు చేరుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ సూచించారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో కచ్చితమైన పరిష్కారం



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజాప్రయోజన సేవల కేసుల్లో కక్షిదారులకు శాశ్వత లోక్ అదాలత్ ద్వారా కచ్చితమైన పరిష్కారం దొరుకుతుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు స్థానిక న్యాయ సేవాసదన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఇరుపక్షాల అంగీకారంతో కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు సమాన అవకాశాలను ధర్మాసనం ఇస్తుందన్నారు. రాజీ కుదరని పక్షంలో తీర్పు వెలువరిస్తుందన్నారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగా శాశ్వత లోక్‌అదాలత్‌లో వివాదం పరిష్కారం అవుతుందన్నారు. ఇది అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పుగా పరిగణనలోకి వస్తుందన్నారు. ఫిర్యాదు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోటి రూపాయల పరిహారం వరకూ వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం శాశ్వత లోక అదాలత్‌కు ఉందున్నారు. ఫిర్యాదు దాఖలు చేయడానికి మూడు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందన్నారు.

50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు

- కందులు, పెసలు, మినుములపై 30 శాతం రాయితీ
- రైతులకు అందుబాటులో బీపీటీ, ఆర్ఎన్ఆర్ విత్తన వరి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు వివిధ రకాల విత్తనాలు రాయితీతో ఇవ్వడానికి వీలుగా ధరలు, రాయితీలు ఖరారు చేశారు. ఇప్పటికే 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 50 శాతం రాయితీతో 225 క్వింటాళ్ల జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఇక అంతర పంటల కింద కందులు, పెసలు, మినుములు, చిరుధాన్యాల కింద కొర్రలు, రాగులు రాయితీతో ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ అధికారులు తెలిపారు. నీటి వసతి కింద రెండు రకాల విత్తన వరి అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

- ఎల్ఆర్‌జీ–52, ఎల్ఆర్‌జీ–105, ఐసీపీఎల్–87119 రకాల విత్తన కందులు 2,300 క్వింటాళ్లు కేటాయించారు. పూర్తి ధర క్వింటా రూ.13,980 కాగా 30 శాతం రాయితీ రూ.4,194 పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,786 (కిలో రూ.98) ప్రకారం చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఇవ్వనున్న కందులు భూ విస్తీర్ణాన్ని బట్టి 10 ప్యాకెట్ల వరకు ఇవ్వనున్నారు.
- ఐపీఎం2–14, ఐపీఎం410–3 రకాలకు చెందిన విత్తన పెసలు 85 క్వింటాళ్లు కేటాయించారు. వీటి పూర్తి ధర క్వింటా రూ.13 వేలు కాగా 30 శాతం రాయితీ రూ.3,900 పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,100 (కిలో రూ.91) ప్రకారం చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.10 ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- పీయు–31, ఎల్‌బీజీ–752, ఐపీయు–2–43, టీబీజీ–104, వీబీఎన్8 లాంటి మినుములు 46 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.14 వేలు కాగా, 30 శాతం రూ.4,200 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,800 (కిలో రూ.98) చెల్లించాలి. 4 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా 10 కిలోలు ఇవ్వనున్నారు.
- ఎస్ఐఏ–3156, ఎస్ఐఏ–3159 లాంటి కొర్ర రకాలు 50 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటారూ.8,740 కాగా, ఇందులో 50 శాతం రూ.4,370 రాయితీ పోనూ రూ.4,370 (కిలో రూ.43.70) ప్రకారం చెల్లించాలి. కొర్రలు 2 కిలోల ప్యాకెట్ల రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా 5 ప్యాకెట్లు ఇస్తారు.
- ఇంద్రావతి, వేఘావతి రకాలకు చెందిన విత్తన రాగులు నాలుగు క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.7,250 కాగా, 50 శాతం రాయితీ రూ.3,625 పోనూ రైతులు రూ.3,625 (కిలో రూ.36.25) ప్రకారం చెల్లించాలి. 2 కిలోల ప్యాకెట్ రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా ఆరు ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–5,048 రకాలకు చెందిన విత్తన వరి 1,600 క్వింటాళ్లు కేటాయించారు. వీటి ధర రూ.4,180 కాగా ఎన్ఎఫ్ఎస్ఎం కింద రూ.1,000, నాన్ ఎన్ఎఫ్ఎస్ఎం కింద రూ.500 ప్రకారం రాయితీ వర్తిస్తుంది. మిగతా మొత్తం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. 25 కిలోలు, 30 కిలోల ప్యాకెట్ల రూపంలో ఒక్కో రైతుకు గరిష్టంగా నాలుగు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.

క్లుప్తంగా

పుస్తక పఠనం అలవర్చుకోండి



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

కనగానపల్లి: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల గ్రంథాలయ అధికారి గోవిందు సూచించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, యోగాపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం యోగా గురువు సుబ్బరాయుడు యోగాసనాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు. యోగా వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక సామర్థ్యం కూడా పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్



మాట్లాడుతున్న కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం మెడికల్: కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నియంత్రించొచ్చు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో సర్వే పక్కాగా నిర్వహించాలని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని పీహెచ్‌సీల పరిధిలో సర్వే నిర్వహించాలన్నారు. కొత్త కేసు నమోదైతే.. కాంటాక్ట్ మెంబర్స్‌కు కీమో ప్రొఫిలాక్సిస్ మందులు అందించాలన్నారు. ఆ ప్రాంతంలో ఫోకల్ సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కుష్టు వ్యాధి ఏ దశలో ఉన్నా 6 నెలలు, 12 నెలల్లో బహుళ ఔషధ చికిత్సతో నయం చేయవచ్చని తెలిపారు. సమావేశంలో డాక్టర్ శివారెడ్డి, పారా మెడికల్ అధికారులు నాగన్న, సూర్యప్రకాష్‌రెడ్డి, రాముడు, హెచ్ఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

- ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

రాప్తాడురూరల్: బాల్య వివాహాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం 5వ సెక్టార్ సత్యదేవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికల మాసిక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. కిశోర బాలికలు చదువు మధ్యలో ఆపేయొద్దని కోరారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలని కోరారు. కష్టపడి చదువుకుని ఉద్యోగాలు పొందాలన్నారు. పీరియడ్ సమయంలో తగిన జాగ్రత్తలు, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ సమయంలో మూఢ నమ్మకాలు వీడాలన్నారు. రోజూ స్కూల్, కళాశాలకు తప్పకుండా వెళ్లొచ్చన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. రోజూ ఆకుకూరలు తినేలా చూడాలని పేర్కొన్నారు. నువ్వులు, వేరుశనగ బర్ఫీలు, పండ్లు, పుల్లని పదార్థాలు తీసుకుంటే రక్తహీనత అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ డి.జయశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్త కె.ప్రభావతి, ఆయాలు హెచ్.సునీత, బి.గంగావతి, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



రాజు రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం కార్పొరేషన్: ఈనెల 25న సాక్షి దినపత్రికలో విద్యుత్ స్తంభం కూలితేకాని స్పందించరా శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం నగరంలోని రాజు రోడ్డులో శిథిలావస్థలో ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. ఆ ప్రదేశంలో మరో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తూ..

- ఆర్టీసీ ఆస్పత్రిలో సమయానికి రాని వైద్యుడు
- వచ్చేది 12 గంటలకు.. వెళ్లేది 3:30 గంటలకు
- పనిలేక సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్న సిబ్బంది
- పర్యవేక్షణ లోపంతో ఇబ్బందులు పడుతున్న రోగులు



ఆస్పత్రి వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు



12 గంటలైనా తెరచుకోని వైద్యుడి గది



వైద్యుడు లేక సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్న సిబ్బంది

అనంతపురం క్రైం: స్థానిక ఆర్టీసీ ఆస్పత్రిలో ఓ వైద్యుడు సమయపాలన పాటించడం లేదు. తనకు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి.. విధులను ముగించుకెళ్తున్నారు. ఆర్టీసీ ఆస్పత్రి వైద్యుల పనితీరు అధ్వానంగా ఉందని రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి సకాలంలో వైద్యుడు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సమయపాలన కూడా పాటించడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా వారు స్పందించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ఆర్టీసీలో కేవలం కింది స్థాయి సిబ్బంది, ఉద్యోగులపై మాత్రమే క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. ఉన్నతాధికారులు, అధికారులు, కీలక విభాగాలకు చెందిన వారిపై కనీస చర్యలు కూడా ఉండవని చెబుతున్నారు. సోమవారం ఆర్టీసీ ఆస్పత్రికి వచ్చిన రోగులు, సిబ్బందిని ఆరా తీయగా వైద్యుడు రాలేదని చెప్పారు. మధ్యాహ్నం 1 గంటకు వస్తారని చెప్పారు. చాలా కాలంగా వైద్యుడు ఆస్పత్రికి ఆలస్యంగా వస్తున్నారన్న ఆరోపణలపై ఆర్ఎం కార్యాలయంలోని అధికారులను ఆరా తీయగా.. ఏదైనా పనిమీద వెళ్లి ఉంటారు.. వస్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

రోజుకు 90 మందికి తగ్గని రోగులు

ఆర్టీసీ ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి వైద్య చికిత్సల నిమిత్తం వచ్చే రోగులు సంఖ్య 90కి పైగానే ఉంది. వీరంతా ఉదయాన్నే ఆస్పత్రికి వచ్చి త్వరగా చూపించుకుని తిరిగి స్వస్థలాలకు చేరుకోవాలని వస్తుంటారు. కాగా వైద్యులు సకాలంలో విధులకు హాజరుకాక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు రాక పోవడంతో ల్యాబ్, ఇతర విభాగాలకు చెందిన అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా పనిలేక సెల్‌ఫోన్లతో కాలయాపన చేయాల్సి వస్తోంది. ఉదయం 9 గంటలకు సిబ్బంది ఆస్పత్రి తలుపులు తెరిచినా వైద్యుడు మధ్యాహ్నం 12 లేదా 1 గంటకు ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యుడు రాగానే రోగికి పరీక్షలు నిర్వహించి ల్యాబ్ టెస్ట్, ఇతర మందులు, పరీక్షలకు సిబ్బంది వద్దకు పంపితే భోజన సమయంలో వారిపై పనిభారం ఒక్కసారిగా పడుతోంది. దీంతో వైద్యుడి కోసం ఉదయం వచ్చి సాయంత్రం దాకా పరీక్షలు చేయించుకుని ఊళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రిపోర్టుల కోసం తిరిగి ఉదయాన్నే రావాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. సాయంత్రం 4:30 నుంచి 5 గంటలకు మూతపడాల్సిన ఆస్పత్రి.. రోజు 3:30 గంటలకే మూసేస్తున్నారని తెలిపారు. విధులకు ఆలస్యంగా వచ్చి.. గంటన్నర ముందే వెళ్లిపోతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని సమయపాలన బోర్డు

ఆస్పత్రి వైద్య సేవలకు సంబంధించి పని వేళలు తెలిపే ఒక్క బోర్డు లేదు. అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంపై ఉద్యోగులు, కార్మికులకు సమస్యలు తలెత్తినప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియదు. నేరుగా ఉన్నతాధికారులకు వారి సమస్యలను చెప్పుకోలేక.. ఇబ్బందులు పడలేక రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని ఆర్టీసీ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు.

నేడు గోకుల గోవింద స్వామి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇస్కాన్ వారి గోశాలలోని గోకుల గోవింద స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మందిరం నిర్వాహకుడు దామోదర గౌరంగదాసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, స్వామికి మహాభిషేకం, అష్టదళ పాదపద్మార్చన, ప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు. భక్తులందరూ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

'స్నేహితుడి భార్యపై కన్నేసి హత్యకు గురయ్యాడు'

అనంతపురం: భార్యపై కన్నేసిన స్నేహితుడిని హతమార్చిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలను మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ధరణి కిశోర్ సోమవారం వెల్లడించారు. ఈనెల 25న అనంతపురం టౌన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో రెండో రోడ్డు క్రాస్ వద్ద సుగాలి జయపాల్ నాయక్ (45) హత్యకు గురయ్యాడు. సుగాలి జయపాల్ నాయక్ స్నేహితుడు అయిన శ్రీనివాసులు నాయక్ (38) నగరంలో ప్రైవేట్ స్కూల్ బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్కూల్ లేని సమయంలో ఆటో నడుపేవాడు. ఇరువురూ మంచి స్నేహితులు. మృతుడు జయపాల్ నాయక్ తరచూ శ్రీనివాస్ నాయక్ ఇంటికి వెళ్లేవాడు. శ్రీనివాస్ నాయక్ భార్యతో చనువుగా మాట్లాడుతూ ఉండటంతో అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకున్నాడు. జయపాల్ నాయక్‌పై పగ పెంచుకున్న శ్రీనివాస్ నాయక్ అతడ్ని అంతమొందించాలని పన్నాగం పన్నాడు. ఈనెల 25న రాత్రి 10 గంటల సమయంలో రెండో రోడ్డులో స్కూటర్‌లో వస్తున్న జయపాల్ నాయక్‌ను వెనుక వైపు నుంచి ఆటోతో ఢీకొట్టాడు. బ్రిడ్జి కింద పక్కనే ఉన్న ఒక పెద్ద సిమెంట్ కాంక్రీట్ రాయితో జయపాల్ నాయక్ తలపై రెండు సార్లు బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దు



అశోక్‌నగర్ బ్రిడ్జ్ వద్ద పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో పూడికతీత పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరంలోని సాయినగర్, అశోక్‌నగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. పూడికతీత పనులను పక్కాగా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పూడికను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. పూడిక తొలగించడం ద్వారా కాలువలు బ్లాక్ కాకుండా ఎటువంటి డ్రైనేజీ సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. నగర ప్రజలు సైతం సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. చెత్తా, చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. నగరపాలక సంస్థకు చెందిన క్లాప్ ఆటోలు, చెత్త వాహనాలు, పుష్‌కాట్లకు అందించి సహకరించాలన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను చేపడుతున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ తరఫున ఇప్పటికే చెత్త సేకరణ, పారిశుధ్యం మెరుగు, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దోమకాటు వ్యాధులు ప్రబలకుండా వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన వేరుశనగ పంపిణీ చేయాలి

రాప్తాడు: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ కోరారు. సోమవారం మండల కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తన కాయల ప్యాకెట్లను పరిశీలించారు. కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న విత్తనాలను ఉచితంగా అందజేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని ఏఓ శేఖర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ధనుంజయ, నాగేష్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం



సాకే చిన్న చంద్రాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం టైం స్కేల్ ఉద్యోగి సాకే చిన్న చంద్రాయుడు సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. గత రెండు రోజుల కిందట అనారోగ్యంతో సాకే చిన్న చంద్రాయుడు మరణించారు. ఎస్కేయూలో సంస్మరణ సభ నిర్వహించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామచంద్ర ,టైం స్కేల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సంజీవప్ప, సెక్రెటరీ సి.నాగలింగం, వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీరాములు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు



గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు గ్రామస్తులను హెచ్చరించారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు అనవసరంగా గొడవలకు వెళ్లొద్దని సూచించారు. సోమవారం ఉదయం మండలంలోని కనుముక్కల గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఏపీఎస్పీ, స్థానిక పోలీసులు గ్రామంలోని వీధుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, గతంలో లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లను తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. చట్టాన్ని ఉల్లఘిస్తే కఠినంగా శిక్షించడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో ప్రశాంతంగా ఉన్న వారిని రెచ్చగొట్టేలా చేస్తే అలాంటి వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

ఆత్మకూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడి దాడులు చేసుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునీర్ అహమ్మద్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని తలుపూరు, మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. గ్రామాల్లో ఎవ్వరూ ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా చట్ట వ్యతిరేక పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల రోజున రాజకీయ పార్టీ నాయకులు బాణాసంచా పేల్చడం, ర్యాలీలు వంటివి చేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు.

విద్యతో పాటు క్రీడలు తప్పనిసరి

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు



క్రికెట్ నెట్స్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, చిత్రంలో ప్రొఫెసర్లు

అనంతపురం మెడికల్: విద్యతో పాటు క్రీడలు తప్పనిసరి అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఆడిటోరియం సమీపంలో ఏర్పాటు చేసిన రెండు క్రికెట్ నెట్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు గురవుతుంటారన్నారు. అటువంటి వారికి క్రీడా పోటీలు ఎంతో మానసికోల్లాసాన్ని అందిస్తాయమన్నారు. తమ కళాశాలలో ఆసక్తి కల్గిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షిద్దాం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. మొక్కలను విరివిగా పెంచడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే కళాశాల ఆవరణంలో పచ్చని తోరణంగా చెట్లు ప్రతిబింబిస్తుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్ సోనియా, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్, డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ ఆత్మరాం, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ ఉమామహేశ్వర రావు, హాస్టల్ వార్డెన్లు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ గాలేటి చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ జాబితా ప్రదర్శించాలి

కనగానపల్లి: ప్రభుత్వ ప్రకటించిన ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైన రైతుల జాబితాలను స్థానిక ఆర్‌బీకేల్లో ప్రదర్శించాలని ఏపీ రైతు సంఘం నాయకులు ఏఓ కృష్ణకుమారిని కోరారు. సోమవారం స్థానిక ఏఓ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు మహాదేవ్, నాగరాజు స్థానిక రైతులతో కలసి మాట్లాడారు. గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా కనగానపల్లి మండలానికి శ్రీ సత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా రూ. 9.5 కోట్లు పరిహారం మంజూరైనట్లు జిల్లా వ్యవసాయాధికారులు ప్రకటించారు. ఈ పరిహారానికి సంబంధించిన డబ్బులను గత వారం రోజుల నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని రైతులకు పరిహారం డబ్బులు జమకావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద స్థానిక వ్యవసాయ సిబ్బంది ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలను ప్రదర్శిస్తే రైతులు వారి పేర్లను సరిచూసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు బాలరాజు, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.



పార్క్‌లో రంగులు వేసి దృశ్యం

సుందరంగా బుద్ధ విహార్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఉద్యానవనాల అభివృద్ధికి పాలకవర్గం, నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఏడీఏ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో పార్కుల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఆదర్శ నగర్‌లోని బుద్ధ విహార్ పార్క్‌కు మెరుగులు తుది మెరుగులు దిద్దుతున్నారు. పార్క్‌లోని గోడలు, తదితర ప్రాంతాల్లో రంగులు వేయడంతో పార్క్ సుందరంగా కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పార్క్‌కు వస్తున్నారు. ఇదిలా ఉండగా పార్క్‌లో వ్యాయామానికి సంబంధించిన పనిముట్లు రిపేరీ చేయించాల్సి ఉంది. వర్షం వస్తే పార్క్‌లో ఓ వైపు నీరు నిల్వ ఉంటోందని ప్రజలు చెబుతున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆదర్శ నగర్‌లోని బుద్ధ విహార్ పార్క్,



పచ్చని గడ్డిలో ఆడుకుంటున్న చిన్నారులు

పంటల బీమా పరిహారం ప్రకటించాలి

కనగానపల్లి: గత ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పంటల బీమా పరిహారాన్ని ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ్ కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడులు రాక చాలా మంది నష్టపోయారన్నారు. దీనిపై కేంద్ర కరువు బృందాలు కూడా సర్వే నిర్వహించి కరువు మండలాలు కూడా ప్రకటించిందన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి రైతులకు బీమా పరిహారాన్ని ప్రకటించాలన్నారు. రైతుల ఖరీఫ్ పంట రుణాల పరిమితిని మరింత పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు పసుల నాగరాజు, సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, సభ్యులు నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు, సీపీఐ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ హమీద్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. గతంలో పంట రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ మాత్రం కట్టించుకొని పంట రుణాన్ని రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం కార్యదర్శి ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్క దేవతల ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకున్న అక్క దేవతలు



అలంకరణలో అక్క దేవతల ఆలయం



చెరకు మోపులను జల్దికి తీసుకెళ్తున్న భక్తులు

ఆత్మకూరు: ఆత్మకూరులో కొలువుదీరిన అక్క దేవతల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం చెరకు మోపులను ఉరుములతో తీసుకువచ్చి పూజలు చేపట్టారు. అనంతరం జల్దికి చేర్చారు. అదే విధంగా మంగళవారం జల్దిపూజ కార్యక్రమం నిర్వహించి, అక్క దేవతల గంపను కొలను నుంచి గుడి వద్దకు చేరుస్తారు. అనంతరం కొలను దగ్గర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం పరుషతో పాటు పన్నేరపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పుతారు. ఉత్సవాల్లో భాగంగా అక్క దేవతల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా ఆలయం వద్ద పెద్ద పెద్ద అంగళ్లను ఇప్పటికే ఏర్పాటు చేశారు.